ఆట బొమ్మలా ఉంటుంది. బానిసలా వుండకుండా ఆటబొమ్మలా వుండటానికి ఎక్కువ మంది యిష్టపడుతున్నారు. డబ్బు వుంటే 'ట్రెడిషన్' అక్కర్లేదు. డబ్బుకి కాని ఆస్తులకి కాని ప్రమాదంవస్తే ఆడవారికి 'ట్రెడిషన్' అక్కర్లేదు. లేకపోతే కావాలి.

మళ్ళీ మొదటికొద్దాం. అందమైన అబద్ధాలు అంటే – మనం కొత్తచీర కట్టుకుని కుచ్చెళ్ళు సర్దుకుంటూ "ఎలా ఉందండీ" అని అడిగితే మనవాళ్ళు "బావున్నావు చాలా బాగున్నావు. ఈ చీర నీకు ఫస్టుగా వుంది" అంటారు! అనకపోతే మనం ఎందులోనన్నా దూకాలి. నిజం చెప్పేస్తే భరించేశక్తి మనకు వుండొద్దూ? మా వారప్పుడప్పుడు సడెన్‌గా వచ్చి "యిప్పుడు అర్జంటుగా సినిమాకెళ్లాలి" అని గోడవచేస్తారు. నేను అర్జంటుగా ఎల్లాగా తెవలలేనని వారికి తెలుసు. ఇప్పుడు కుదరదండీ అని నాచేత అనిపించి తరువాత ఆయన ఎక్కడో పనుందంటూ వెళ్ళిపోతారు. ఇదో ట్రిక్కని నేను తరువాత గ్రహించాను.

"లే పద. ఇవాళ మనం మనోరమాలో భోజనంచేసి లీలామహలుకి వెళ్ళాలి" అంటారు. అంతా ఉత్తిదే – మనోరమలో భోజనంచేస్తే పది రూపాయలు అవుతుందని నేను గుండె బాదుకుంటానని ఆయనకు తెలుసు.

"నువ్వెక్కడికిరావు. మళ్ళీ నిన్నెక్కడికీ తీసుకెళ్ళడం లేదని నాకు బాధగా ఉంటుంది" అని మొసలి కన్నీరుకారుస్తూ వుంటారు.

"జేబులో డబ్బు వుండాలి – ఏం చేశారు" అని క్రాసెగ్జామిన్ చేశాననుకోండి. అల్లవారి కప్పిచ్చాను. వీరి కప్పిచ్చాను అనికోస్తారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఆ అప్పులు వసూలు చేశారా అంటే "అయ్యో మొన్న నీ కిచ్చిన పాతికా ఎక్కడి"దని దబాయిస్తారు. మిసెప్రాప్రియేషన్లో తెలిసి పోయే తెలివితక్కువ అబద్ధాలు చెప్పటంలో మావారు పద్మశ్రీ. అయితే ఆ మొహం కేసి చూస్తేనే తెలిసిపోతుంది అబద్ధాలు చెప్పటానికి ఆయన తెలివితక్కువగా పడే తాపత్రయం... అయితే ఆ డబ్బు ఎల్లా తగలబెట్టారో నిజవడిగి తెలుసుకున్నాక – ఆ కటువైన నిజం ముందు నిలబడి అవమానం పొందడంకంటె ఈ అబద్ధాల పాదధూళి కాస్త నెత్తిన జల్లుకోవడమే సుఖం, శుభప్రదమూనూ. దీనివల్ల నీతి ఏమంటే నిజం చెప్పమని భర్తలను కాకరకాయ కూరలా వేపుకు తినకూడదు. ఎవరి అబద్ధాలు వారివేకాని జీవితం మాత్రం ఇద్దరిదీనూ.

# నేపథ్యంలో....

మనం గడిపే రోజువారీ జీవితానికి సంబంధం లేకుండా నేపథ్యంలో అనేక ధ్వనులు వినిపిస్తూ వుంటాయి. ఇందులో కొన్ని ఒక క్రమం ప్రకారం కొన్ని నిర్ణీతసమయాల్లో వినిపిస్తాయి. మిగతావి అనూహ్యాలు, అప్పటికప్పుడు వినిపించేవి. మనకి యిష్టమున్నా లేక పోయినా గోల భరించాల్సిందే – ఎక్కడికి పారిపోయినా ఇవి తప్పవు. అంతర్ముఖులం అయితే తప్ప –

ప్రకృతిలో సంగీతం ఉంది. అయితే కొన్ని చప్పుళ్ళు మనకు గిట్టవు. పగలు ఒక రకంహోరు - రాత్రిళ్ళు శబ్దాలు మరొక రకం - ఇవన్నీ మనం గడిపే జీవితానికి బ్యాక్ గ్రవుండు మ్యూజిక్‌ని సప్లయి చేస్తాయి మన ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా.

అయితే వీటిని మనం ఎంత వరకు ఎంజాయి చేస్తున్నా మంటే చెప్పటం కష్టం. మన జీవితంలో ఒక భాగంగా వుండిపోయిన వాటిని ఎంజాయ్ చేయటం ఏవిటి?

రాత్రిళ్ళు అలారం టైంపీసుగాని గోడ గడియారంకాని టిక్ టిక్ మని గుండెలమీద కొట్టి మాట్లాడినట్లు పలుకుతాయి. ఒకవేళ నిద్రపట్టక వంట్లో బాగులేకపోతే దాని చప్పుడు భరించరానంతగా మారిపోతుంది. నేనప్పుడప్పుడూ గడియారాన్ని బోర్లాపడుకోపెట్టి దానిమీదో దిండో తువ్వాలో పుస్తకమో కప్పుతూ వుంటాను.

పంపు సరిగా తిప్పకుండా వదిలేస్తే దానిలోంచి టప్ టప్‌మని కారే నీటి చప్పుళ్ళు కూడా దుర్భరాలే లేద్దామంటే బద్ధకం, మగతగా వుంటుంది. ఆ చప్పుడు మరీ భయంకరంగా డిస్టర్బింగ్‌గా వుంటుంది.

ఇవిగాకుండా మెట్లమీద కాలిజోళ్ళ చప్పుళ్ళు వినిపిస్తాయి. వాటితోనే దగ్గులు దూరంగా మాట్లాడుకునే గొంతుకలు వినిపిస్తాయి.

సినిమాకు వెళ్ళి వచ్చేవాళ్ళు పెద్ద గొంతుకలతో సినిమా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తారు.

రాత్రిపూట బావి గిలక కర్రు కర్రుమంటూ నూతిలోంచి పైకి బాల్చీని లాగుతూ వుంటుంది. బాల్చీ నూతిలోకి దూకుతున్నప్పుడు గట్టుని ఢీకొని చేసే ఓటిగోలకు నిద్రపడుతూ పడుతూవున్న సమయంలో మెలకువ వచ్చేస్తూ వుంటుంది.

వుండీ వుడిగే రోడ్డుమీద పోయే మోటార్ సైకిల్ "ఫట్ ఫట్" మని చేసే ధ్వనికి మెదడు స్క్రూలు వదులవుతాయేమోనని భయం వేస్తుంది. ఆ వీధిలోనే ఎక్కడో ఒక లారీ డ్రయివరున్నాడు. రాత్రి విధిగా పదకొండు పన్నెండున్నర గంటల మధ్య ఆ లారీ బడబడా చప్పుళ్ళు చేసుకుంటూ నిశ్శబ్దంగా నిద్రపోతున్న వీధిలోకి ప్రవేశించి చాలాసేపు అల్లరీ ఆగం చేస్తుంది. క్రింద వరండాలో పడుకుని పెద్ద పెట్టున గుర్రుపెట్టే ఇంటాయన గుర్రు ఒకప్పుడు తీవ్రస్థాయిలో ఒకప్పుడు మంద్రంగానూ వినపడుతుంది. తరువాత హఠాత్తుగా ఒక కుక్క అరుస్తుంది. ఆ వెనువెంటనే అనేక కుక్కలు అరుపులకి లంకించుకుంటాయి. ఎంతకీ వదలవు. ఏ జ్వరంవచ్చో నిద్రపట్టక మంచంలో కూర్చుంటే యివన్నీ విధిగా విని తీరాల్సిందే. కార్లు సర్రున దూసుకుపోయిన చప్పుడు, వాటి హెడ్‌లైట్ల కాంతి మన గదిలోకి దూసుకువచ్చి స్లోగా నిష్క్రమించటాన్ని చూస్తూ పడుకోటం, ఇహ చుట్టు ప్రక్కల ఎక్కడైనా పెళ్ళయితే రికార్డుల మ్యూజిక్ తగులుకుందన్నమాటే - మధ్యలో అపస్వరాలతో పాటలు పాడే ఔత్సాహిక గాయక గార్దభాలు కొన్ని, ఈ మధ్యన ఒక్కొక్క మొగలో అరడజనుకు మించి రేడియోసెట్లు రాత్రి పదిన్నర వరకూ చెవి కోసిన మేకల్లాగా అరుస్తూనే వుంటాయికదా! రేడియోలు మూసేశారంటే యిల్లు కొంత చల్లబడిందనుకోవాలి. అర్ధరాత్రి వేళ గేట్లు తీసిన కిరకిరకు - రోడ్డుమీద పోతూ భయం

లేకుండా వుండేందుకు కుర్రాళ్ళు బిగ్గరగా పాడే పాటలు - యింకా ఓ రాత్రివేళ కృష్ణానది హోరు. రైలు స్టేషన్ దగ్గర ఇంజన్లూ వాటి రాకపోకల ధ్వనులు ఇవన్నీ వింటూ అటూ యిటూ వొత్తిగిల్తూ రాత్రి గడపాల్సిందే. కళ్ళు పొడారిపోతాయి. కడుపులోపలికి వెళ్ళిపోతుంది. కొబ్బరాకుల మధ్యనుంచి గదిలోకిపడే కాంతిని వెలుగు నీడలను, హెడ్‌లైట్ల వెల్తురునూ చూస్తూపడుకోవటం ఎప్పుడు తెల్లారుతుందా అని వాపోతూ.

ఒంటిగంట దాటాక చౌకీదారు టక్‌టక్‌మని కర్రతో తలుపుల మీద కొడుతూ వస్తాడు - వాడి రాకను సహించలేనట్లు ఒక కుక్క బంయ్ మని అరుస్తుంది. మళ్ళీ చిన్న నిద్ర. అంతలోనే నీళ్ళకోసం మోటారు వేస్తారు. అది డుబ్ డుబ్ మని కొట్టుకోవటం ప్రారంభిస్తుంది. వాకిట్లోకి లేచేవాళ్ళ తలుపు చప్పుళ్ళు, క్రింద ఇళ్ళలో చీపురు గరగరలతో సుప్రభాత మవుతున్నట్లు తెలుస్తుంది. కొందరిళ్ళలోంచి యిప్పుడిప్పుడు పాలుకాచే వేళ మిల్క్ బాయిలర్ వేసే విజిల్సు వినిపిస్తుంటాయి. ఒక్కో రాత్రి ప్రత్యేక కార్యక్రమంలా ఎవరిదో దెబ్బలాటో, ఎవరింట్లోనో ఎవరో పోయిన శోకన్నాలో, పిల్లలు బిగ్గరగా చదువుతున్న చప్పుళ్ళో వినిపిస్తాయి. మన జీవితం మనదేకాని నేపథ్యంలో యిన్ని ధ్వనుల మధ్య మనం జీవిస్తూంటాము. దాన్ని సంగీతమనవచ్చో లేదో నాకు తెలియదు. మనచుట్టూ వున్న ప్రపంచంలోంచి మన కిష్టమైనవీ కానివీ ధ్వనులు మన ప్రమేయం లేకుండా పుట్టుకొస్తాయి. ప్రతి రాత్రీ ఆలకిస్తే కొత్త కొత్త ధ్వనులు వినిపిస్తాయి. రంజాన్ టైమ్‌లో తెల్లవారు ఝామున పాడుకుంటూ అదేదో తమాషాగా వాయించుకుంటూ నిద్ర లేవగొట్టేస్తూంటారు - అల్లాగే సంక్రాంతి టైములో బుడబుక్కలవాడు డక్కికొడుతూ, గంగిరెద్దుల వాడూ వగైరా వగైరా లంతా వస్తారు. నేపథ్యం గురించి ఎవరికి వారే ఆలోచించుకున్న కొద్దీ ఎన్నెన్నో కొత్త సంగతులు పుడతాయి. పగటి పూట శబ్దాలు గురించి తెలిసిన వారెవరైనా రాయొచ్చు. చాలా తమాషాగా వుంటుంది రాస్తే -

# బాంబూ తగూ

**మా** చిన్న కుర్రాడికి డిక్టేషన్ చెబుతూ బాబు అని రాయమంటే బాంబు అని రాసినందుకు నవ్వుకున్నాం. మావారు వీడు యాటం సైంటిస్టు అయ్యే లక్షణాలు కనపడుతున్నాయ్ అని సంతోషించారు. నేను సంతోషించలేదు. బాంబులు ప్రేల్చడం మన యింటా వంటా లేదు. పనికిరాదు అని వారించా. "ఓసీ వెర్రిదానా మన ఇండియా బాంబు ప్రేల్చబట్టే గదా మన్ని గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటున్నారు. మన పేరు నలుగురి నోట్లో నాన్తే మనకు ప్రతిష్ఠో అప్రతిష్ఠో తప్పకుండా వస్తుంది. సైన్సు డెవలప్ కాకపోబట్టే ఇండియా అంటే కోతులు కుక్కలు అర్ధదిగంబర అర్ధాకలి రాజ్యం అని అంతా అనుకుంటున్నారు" అని మా వారు ఓ గంభీరోపన్యాసం దంచారు.